క్లుప్తంగా

నాణ్యమైన భోజనం అందించాలి



నస్రుల్లాబాద్(బీర్కూర్): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బీర్కూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం స్పీకర్ విద్యార్థులతో మాట్లాడి, భోజనం, వసతి సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. డార్మెట్రి కోసం నూతనంగా నిర్మిస్తున్న భవనం త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక నాయకులు,అధికారులు ఉన్నారు.

నిబంధనల ప్రకారం పనులు చేపట్టాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఉపాధి కూలీలు నిబంధనల ప్రకారం పనులు చేపట్టాలని ఎంపీడీవో రఘు సూచించారు. మండలంలోని తాండూర్ శివారులో చేపట్టిన ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా పనులు చేస్తున్న కూలీల హాజరు మస్టర్‌ను తనిఖీ చేశారు. పని ప్రదేశంలో కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ఉపాధి సిబ్బందిని ఆయన ఆదేశించారు.

పనులను వేగవంతం చేయాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని రాంపల్లి స్కూల్ తండా పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీవో ప్రభాకరచారి సూచించారు. గ్రామ పంచాయతీలో బుధవారం ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. పంచాయతీ పరిధిలోని సమస్యల పరిష్కారంపై చర్చించారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. సర్పంచ్ పరశురాం, కార్యదర్శి, వార్డుసభ్యులు ఉన్నారు.

పంటపొలాల పరిశీలన



నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం పెద్ద ఎడ్గి గ్రామ శివారులో సాగు చేస్తున్న వరి, జొన్న, రాజ్మా పంటలను బుధవారం వ్యవసాయ శాఖ ఏడీఏ నూతన్‌కుమార్ పరిశీలించారు. పంటలను ఆశిస్తున్న తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రసాయ మందుల పిచికారి వివరాలను రైతులకు వివరించారు. రాత్రివేళ ఉష్ణోగ్రతలు పడిపోవడంతో పంటలపై తెగుళ్లు ఆశిస్తున్నాయన్నారు. క్లస్టర్ ఏఈవో విశాల్‌గౌడ్, వెంకటి, మారుతి ఉన్నారు.

తైబజార్ రుసుం వసూలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలకేంద్రం గోపాల్‌పేట గ్రామపంచాయతీ పరిధిలో 2022–23కు సంబంధించి రూ.2లక్షల తైబజార్ బకాయి రుసుమును బుధవారం సంబంధిత కాంట్రాక్టర్ నుంచి జీపీ సిబ్బంది వసూలు చేశారు. తైబజార్ రుసుమును ఇప్పటివరకు 50శాతం కూడ వసూలు చేయలేదని మంగళవారం ఎంపీవో శ్రీనివాస్ చేపట్టిన తనిఖీలో వెల్లడైంది. దీంతో రుసుము వసూలు చేయడంలో నిర్లక్ష్యం చేసిన పంచాయతీ కార్యదర్శికి ఎంపీవో మెమో జారీ చేశారు. ఈమేరకు తైబజార్ కాంట్రాక్టర్ మశ్చేందర్‌గౌడ్ నుంచి రూ.2లక్షలు వసూలు చేసినట్లు కార్యదర్శి భూమేశ్వర్ తెలిపారు.

పాడి పశువులను పెంచుకోవాలి



తాడ్వాయి(ఎల్లారెడ్డి): రైతులు వ్యవసాయంతో పాటు పాడి పశువులను పెంచుకోవాలని కామారెడ్డి పాలశీతలీకరణ కేంద్రం అధ్యక్షుడు తిరుపతిరెడ్డి అన్నారు. మండలంలోని ఎర్రాపహాడ్‌లో బుధవారం ఆయన పాడిరైతులతో సమావేశం నిర్వహించారు. పాడి పశువులను పెంచుకునే రైతులకు ప్రభుత్వం అన్ని విధాల సదుపాయాలను కల్పిస్తుందన్నారు. ప్రయివేటు డెయిరీలలో పాలు పోయవద్దని, విజయ డెయిరీ పాలకేంద్రాలలో మాత్రమే పాలు పోయాలని సూచించారు. డీడీ ప్రవీణ్ కుమార్, ఎర్రాపహాడ్ బీఎంసీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, బీఎంసీల ఇన్‌చార్జిలు నిరంజన్ రెడ్డి, రవిందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి

మాచారెడ్డి: పద్మశాలీలు ఐక్యంగా ఉంటూ రాజకీయంగా ఎదగాలని సంఘం జిల్లా అధ్యక్షుడు సిరిగాద లక్ష్మి నర్సయ్య సూచించారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జిల్లా, మండల సంఘ ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ జయంతి

సాక్షి నెట్‌వర్క్, కామారెడ్డి: జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలు, గ్రామాలు, తండాల్లో బుధవారం గిరిజనులు తమ ఆరాధ్యదైవం సేవాలాల్ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. అలాగే ప్రత్యేక పూజలు, భోగ్‌బండార్ నిర్వహించారు. పలు గ్రామాల్లో ర్యాలీలు, సాంస్కృతిక ప్రదర్శనలు, అన్నదానాలు వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. నస్రుల్లాబాద్ గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో నిర్వహించిన భోగ్‌బండార్‌లో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఎల్లారెడ్డిలో టీపీసీసీ కార్యదర్శి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి, బంజారా సంఘం నాయకులు సేవాలాల్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. గాంధారిలో నిర్వహించిన సేవాలాల్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే జాజాల సురేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుభాష్‌రెడ్డి, మదన్‌మోహన్ రావు, జమున రాథోడ్ ఉన్నారు. కామారెడ్డిలో డీఈవో రాజు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నస్రుల్లాబాద్ గురుకులంలో నిర్వహించిన భోగ్‌బండార్‌లో మాట్లాడుతున్న స్పీకర్ శ్రీనివాస్‌రెడ్డి





బాన్సువాడలో సేవాలాల్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న గిరిజనులు.. కామారెడ్డి పట్టణంలో..



సోమర్యాగడి తండాలో..



ఎల్లారెడ్డి బంజారా భవన్‌లో..



పిట్లం మండల కేంద్రంలో..



రామారెడ్డిలో కేక్ కట్ చేస్తున్న బంజార నేతలు





తున్కిపల్లి తండాలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు.. శేర్‌శంకర్ తండాలో..



లింగంపేట మండల కేంద్రంలో..







గాంధారిలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సురేందర్.. మాచారెడ్డిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు.. క్యాసంపల్లి గ్రామంలో..

కొనసాగుతున్న కంటివెలుగు శిబిరాలు





టికారం తండాలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది.. తాండూర్‌లో..

నస్రుల్లాబాద్/పెద్దకొడప్‌గల్/ఎల్లారెడ్డిరూరల్/నాగిరెడ్డిపేట/తాడ్వాయి: జిల్లాలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరం కొనసాగుతున్నాయి. నస్రుల్లాబాద్‌లోని కంటి వెలుగు శిబిరంలో 123 మందికి పరీక్షలు నిర్వహించామని డా.వైశాలి తెలిపారు. పెద్దకొడప్‌గల్ మండలంలోని టికారం తండాలో కంటి వెలుగు కార్యక్రమన్ని స్థానిక ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఎల్లారెడ్డి మండలంలోని సోమర్యాగడి తండాలో, నాగిరెడ్డిపేట మండలంలోని తాండూర్‌లో కంటివెలుగు శిబిరాలను స్థానిక ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. తాడ్వాయి కంటి వెలుగు సిబ్బందిని సర్పంచ్ సంజీవులు, వైస్ ఎంపీపీ నర్సింలు, స్థానిక ప్రజాప్రతినిధులు సన్మానించారు.

కమ్యూనిటీ భవన నిర్మాణాలకు నిధుల మంజూరు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ తెలిపారు. మున్సిపాలిటి పరిధిలోని దేవునిపల్లి గ్రామంలో బుధవారం ఆయన కమ్యూనిటీ భవన నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేవునిపల్లి, బాలాజీనగర్ తండా, పోసానిపల్లి గ్రామాలలో కమ్యూనిటీ భవనాలు, ఎల్లారెడ్డిలోని రజక సంఘం, గౌడ, వైశ్య సంఘం కమ్యూనిటీ భవనాలకు రూ.10లక్షల చొప్పున, 9వ వార్డులో ఈద్గాకు రూ.25 లక్షలు, కరీమా, జామా మసీదులకు రూ.5లక్షల చొప్పున నిధులు మంజూరైనట్లు తెలిపారు. కౌన్సిలర్లు సాయిలు, రాము, బీఆర్ఎస్ నేతలు సతీష్, ఇమ్రాన్, అరవింద్ ఉన్నారు.



దేవునిపల్లిలో మాట్లాడుతున్న నాయకులు

షబ్బీర్ అలీ జన్మదిన వేడుకలు

బాన్సువాడటౌన్/భిక్కనూరు/దోమకొండ/రాజంపేట/ఎల్లారెడ్డిరూరల్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి షబ్బీర్ అలీ జన్మదినాన్ని బుధవారం పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. పలు మండలాల్లో కేక్ కట్ చేసి, సంబురాలు నిర్వహించారు. స్థానిక ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. రక్తదాన శిబిరాలు నిర్వహించారు. కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, ఆయన కుమారుడు అమెరికాలో నివసిస్తున్న ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ టెక్సాస్ అధ్యక్షుడు బద్దం ఫణిందర్‌రెడ్డి సహకారంతో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్ భిక్కనూరు జీపీ కార్మికులకు దుప్పట్లను అందజేశారు.



భిక్కనూరులో పారిశుధ్య కార్మికులకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సమాచారం..

నేటి నుంచి శనగ కొనుగోలు

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని సొసైటీలో గురువారం నుంచి ప్రభుత్వ శనగ కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నామని మద్నూర్ సొసైటీ చైర్మన్ శ్రీనివాస్ పటేల్ పేర్కొన్నారు. మండలకేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులు పట్టా పాస్‌బుక్, బ్యాంక్ అకౌంట్ బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్ పత్రాలతో పాటు ఏఈవోల ధృవీకరణ పత్రాలు తీసుకచ్చి శనగ కాంటాలు చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు పలు గ్రామాల్లో 'హాత్ సే హాత్ జోడో'

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని మర్కల్, తిర్మన్‌పల్లి, ఉత్తునూర్, కుప్రియాల్ గ్రామాల్లో గురువారం టీపీసీసీ ఉపాధ్యక్షుడు మదన్ మోహన్‌రావు హాత్ సే హాత్ జోడో కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు లింగాగౌడ్ తెలిపారు. పార్టీ కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు వీవోఏలతో సమీక్ష

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలకేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో గురువారం వీవోఏలతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు ఏపీఎం జగదీశ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు.

దరఖాస్తు గడువు పెంపు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మోడల్ స్కూల్‌లో ప్రవేశం పొందుటకు ఆన్‌లైన్ దరఖాస్తు గడువును ఈ నెల 22 వరకు పొడగించినట్లు ప్రిన్సిపాల్ భానుమతి ఒక ప్రకటనలో తెలిపారు. 6–10వ తరగతి వరకు ప్రవేశం పొందుటకు అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

కొటేషన్ల ఆహ్వానం

రామారెడ్డి(ఎల్లారెడ్డి): మండలంలోని కాలభైరవుడి ఆలయంలో పలు రకాల వస్తువుల విక్రయం కోసం ఈనెల 21లోపు సీల్డ్ కవర్‌లో కొటేషన్ అందజేయాలని ఆలయ ఈవో ప్రభుగుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. కొటేషన్ పొందిన వారు వచ్చే నెల 1నుంచి 2024 ఫిబ్రవరి 28వరకు అమ్ముకొనుటకు అనుమతి ఇస్తామన్నారు. ఆసక్తి గలవారు కొటేషన్‌ను ఆలయంలోని కార్యాలయంలో అందించాలని కోరారు.

వ్యసనాలకు బానిసలు కావొద్దు

- విద్యార్థులకు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు సూచన
- పలు కళాశాలల్లో అవగాహన సదస్సులు



ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

ఎల్లారెడ్డి: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, నలంద కళాశాలలో బుధవారం విద్యార్థులకు మత్తు పదార్థాలపై ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. గంజాయి, సిగరెట్, మద్యం వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. చెడు అలవాట్లకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని అన్నారు. ఎస్సై గణేష్, ఎక్సైజ్ సీఐ షాకిర్, జూనియర్ కళాశాల సూపరిండెంట్ శ్రీనివాసాచారి ఉన్నారు.

బిచ్కుంద మండలంలో..

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని కళాశాలలో విద్యార్థులకు బుధవారం ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. ఎక్సైజ్ ఎస్సై అభిషేక్, ప్రిన్సిపాల తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు మండలంలో..

భిక్కనూరు: భిక్కనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బుధవారం దోమకొండ ఎక్సైజ్ సీఐ పోతిరెడ్డి డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్‌హెచ్‌వో ఆనంద్‌గౌడ్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

శివాలయంలో ప్రత్యేక పూజలు



కామారెడ్డి రూరల్: దేవునిపల్లి శివాలయంలో బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మహారాజ పోషకుల ఆధ్వర్యంలో శివస్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. నేటి నుంచి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు శివభిక్ష కమిటీ అధ్యక్షుడు నిట్టు నారాయణరావు, ప్రతినిధులు తెలిపారు.

శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం



దోమకొండ: మండల కేంద్రంలోని శివరాంమందిర్ ఆలయంలో బుధవారం మహ శివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, పల్లకీసేవ వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

త్రిశక్తి ఆలయ వార్షికోత్సవం



కామారెడ్డి అర్బన్: పట్టణంలోని త్రిశక్తి క్షేత్రం ఆలయ వార్షికోత్సవాలు బుధవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు, వ్రతాలు నిర్వహించారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో హోమం



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని మర్కల్ గ్రామంలోగల వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం విగ్రహప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా హోమం, దీపారాధన వంటి పూజాకార్యక్రమాలు నిర్వహించారు. నేడు వేణుగోపాల స్వామి పునఃప్రతిష్ఠాపన, ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన నిర్వహించనున్నట్లు సర్పంచ్ జూకంటి సంగారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా బోనాల పండుగ



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని సజ్జన్‌పల్లి గ్రామంలో బుధవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులు ఇంటికొక బోనం తీసుకొని ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భవానిమాత ఆలయానికి చేరుకొని, అమ్మవారికి సమర్పించారు.

నూతన కార్యవర్గం..

రామేశ్వర ఆలయ కమిటీ..



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని రామేశ్వర ఆలయ నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోట పుండరీకం, ఉపాధ్యక్షుడిగా సంతోష్‌రెడ్డి, కార్యదర్శిగా నీలకంఠ సంతోష్, సహాయ కార్యదర్శి రాజేష్, కోశాధికారి వడ్ల సంగమేశ్వర్ ఎన్నికయ్యారు.

బస్వరెడ్డి సంఘం..



భిక్కనూరు: మండలంలోని అంతంపల్లి బస్వరెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బస్వ పెద్దరాజిరెడ్డి, ప్రధానకార్యదర్శిగా బస్వ మోహన్‌రెడ్డి, కోశాధికారిగా బస్వ రాజిరెడ్డిలు ఎన్నికయ్యారు.

భిక్కనూరు వీఆర్‌ఏల సంఘం..

భిక్కనూరు: మండల గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్ఏ)ల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా స్వామి (కాచాపూర్), ప్రధానకార్యదర్శిగా పిట్ల శంకర్ (లక్ష్మీదేవునిపల్లి), ఉపాధ్యక్షులుగా ద్యాగల సిద్దరాములు (భిక్కనూరు), కోశాధికారిగా వెల్మల అమర్‌భూషణ్(తిప్పాపూర్), సంయుక్త కార్యదర్శిగా బోయిని స్వామి (బస్వాపూర్) సలహదారులుగా బాలయ్య (జంగంపల్లి), గోల్కొండ భూపాల్(మల్లుపల్లి), కార్యవర్గసభ్యులుగా దాసరి నారాయణ (రామేశ్వర్‌పల్లి), బామారాల నర్సింలు (పెద్దమల్లారెడ్డి), ఈర్ల శ్రావన్ (ఇసన్నపల్లి)లు ఎన్నికయ్యారు.



స్వామి, మండలాధ్యక్షుడు వీఆర్‌ఏల సంఘం

నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం..



కామారెడ్డి అర్బన్: టీఎన్‌జీవోస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా నాల్గో తరగతి ఉద్యోగుల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మహ్మద్ షఫీ, సహాయ అధ్యక్షుడుగా కరీం, కార్యదర్శిగా రాజు, కోశాధికారిగా లింగం, ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్, మక్బుల్, కిషోర్, సరళలు ఎన్నికయ్యారు.

కాంగ్రెస్ గిరిజన విభాగం..



బాన్సువాడ టౌన్: కాంగ్రెస్ కమిటి గిరిజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ప్రతాప్‌సింగ్ రాథోడ్ నియమితులయ్యారు. సేవలాల్ జయంతి పురస్కరించుకుని మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు జగన్‌లాల్ ఆధ్వర్యంలో ప్రతాప్‌సింగ్‌కు నియామక పత్రం అందజేశారు.

సంక్షిప్తం

బాలికలకు కరాటే శిక్షణ

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని కొమలంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం బాలికలకు కరాటే మాస్టర్ శిక్షణ ఇచ్చారు. బాలికల్లో ఆత్మస్థైర్యం, స్వీయ రక్షణ కోసం ఈ శిక్షణ ఇస్తున్నట్లు మాస్టర్ తెలిపారు.

సీసీ రోడ్ల పనులు ప్రారంభం

పిట్లం(జుక్కల్): మండలంలోని రాంపూర్‌లో సర్పంచ్ నారాయణరెడ్డి బుధవారం సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. భిక్కనూరు: మండలంలోని ఇసన్నపల్లిలో సిమెంట్ రోడ్డు పనులను ఎంపీపీ గాలిరెడ్డి ప్రారంభించారు. సర్పంచ్ రాములు, వైస్ ఎంపీపీ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బుక్స్ పంపిణీ

కామారెడ్డి రూరల్: మండలంలోని తిమ్మక్‌పల్లి(కె) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు బుధవారం వైస్ ఎంపీపీ ఉరుదొండ నరేష్ ఆల్‌ఇన్‌వన్ బుక్స్ వితరణ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఐలాపూర్ ఉన్నత పాఠశాలకు బుధవారం ప్రైవేటు వైద్యుడు నర్సింలు బోధనోపకరణాలను వితరణ చేశారు. ఉపాధ్యాయులు ఉన్నారు.

టైలరింగ్ శిక్షణ

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి కొత్త ఇందిరానగర్‌లో బుధవారం సోనియా శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్ శిక్షణ శిబిరాన్ని ఫౌండేషన్ ప్రతినిధులు ప్రారంభించారు. సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కు అందజేత

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని పద్మాజీవాడి గ్రామంలో బుధవారం పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను సర్పంచ్ కవిత పంపిణీ చేశారు. బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పన్నులను వెంటనే చెల్లించాలి

ఎల్లారెడ్డి: ట్యాక్సీ వాహనదారులు త్రైమాసిక పన్నులను వెంటనే చెల్లించాలని ఎంవీఐ విక్రమ్ ఒక ప్రకటనలో తెలిపారు. లేనిచో వాహనాలను సీజ్ చేస్తామని పేర్కొన్నారు.

పన్ను వసూళ్లకు స్పెషల్ డ్రైవ్

బీబీపేట: మండలంలోని ఉప్పర్‌పల్లి గ్రామంలో పన్ను వసూళ్ల కోసం జీపీ సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈసందర్భంగా సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ పన్నులు వసూలు చేశారు.

నేడు శివాజీ విగ్రహావిష్కరణ

భిక్కనూరు: మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో గురువారం ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు హిందుస్థాన్ యూత్‌క్లబ్ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని కోరారు.

జాతీయ కార్యశాలకు ఎంపిక

మాచారెడ్డి: మండలంలోని భవానిపేట సర్పంచ్ మద్దెల రాజు రెండోసారి జాతీయ కార్యశాలకు ఎంపికయ్యారు. ఒరిస్సాలోని భువనేశ్వర్‌లో ఈ నెల 17నుంచి 19 వరకు జరగనున్న కార్యశాలకు ఆయన బుధవారం వెళ్లారు. ఈసందర్భంగా జీపీ సిబ్బంది, ప్రజలు ఆయనను సన్మానించారు.

ఆక్రమణలను తొలగించాలి

భిక్కనూరు: మండల కేంద్రంలో మురికికాలువల నిర్మాణం కోసం ఆక్రమణలను పూర్తిగా తొలగించాలని పలువురు గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయానికి తరలివచ్చి, జీపీ పాలక వర్గ సభ్యులతో మాట్లాడారు.